www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 ఆగస్టు 2023

5

కాకినాడ



స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా సోమవారం ఒ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.55 గంటల నుంచి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరై పతాకావిష్కరణ చేస్తారన్నారు. అనంతరం పోలీసు గౌరవ వందన స్వీకరిస్తారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

పరికరాలు లేకుండా పనులు ఎలా?

- పనిముట్ల సరఫరా నిలిపివేతతో కూలీలపై అదనపు భారం
- ఉపాధి హామీ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

'ఇచ్చేది అరకొర వేతనమే అయినా ఉపాధి చట్టం ఆసరాగా ఉంది. గతంలో ఈ పనులకు వెళ్లేవారికి ప్రభుత్వమే పనిముట్లు ఇచ్చేది. ఐదేళ్ళుగా పనిముట్లను ఇవ్వడం ఆపేశారు. సొంతంగా పార, గునపం, తట్ట కొనుగోలు చేసుకునేందుకు అప్పులు చేయాల్సి వస్తుంది' అని రౌతులపూడి మండలం బలరామపురానికి చెందిన ఉపాధి కూలీ ఎ.గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా ఇలా అనేకమంది కూలీలపై అదనపు భారం తప్పడం లేదు. చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే సౌకర్యాలు తగ్గిస్తున్నట్లు కూలీలు అంటున్నారు.

కాకినాడ జిల్లాలో 4.75 లక్షల వరకూ జాబ్ కార్డులు ఉన్నాయి. 5.50 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పనులు వల్ల కొన్ని మండలాల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం కూలీల వేతనాల కోసం 60 శాతం, పరికరాల కోసం 40 శాతం నిధులు వెచ్చించాలి. పరిపాలనా ఖర్చుల కింద 6 శాతం మించకుండా ఖర్చు చేయాలి. పనిముట్ల కొనుగోలుకు అవకాశం ఉన్నా నాలుగేళ్ల నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో అవి కూలీలకు అందడం లేదు.



సొంతంగా కొనుగోలు చేస్తున్నాం



గునపం, తట్ట, పార వంటివి ఐదేళ్ళుగా ఇవ్వడం లేదు. సొంత డబ్బులతో కొనుగోలు చేస్తున్నాం. అధికారులను అడుగుతుంటే తెలియదు అంటున్నారు. పనిముట్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి.

- నేరేడుమిల్లి సూరిబాబు, ఉపాధి కూలీ, తాళ్ళరేవు

తగ్గుతున్న సౌకర్యాలు

ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన మొదట్లో ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించేది. కొన్నేళ్లుగా క్రమంగా వాటిని తగ్గిస్తూ వస్తుంది. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత కేంద్ర విధానాలను అనుసరిస్తూ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగస్వామి అయ్యింది. ఈ పథకంలో మెటీరియల్ విభాగం కింద వస్తున్న నిధులతో సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నారు. ఫలితంగా మెటీరియల్ విభాగంలో నిధులు భారీగా తగ్గిపోతున్నాయి. గతంలో ప్రతి గ్రూపునకు పారలు, గునపాలు, తట్టలు ఇతర సామగ్రితో పాటు నీడ కోసం టెంట్లు అందించేవారు. పని చేస్తున్న కూలీల సంఖ్య కనుగుణంగా గతంలో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పనిముట్లు కోసం ఖర్చు చేసేవారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెద్ద ఎత్తున అధికారులు కూలీలకు పని కల్పిస్తుంటారు. ఈ సమయంలో పనిముట్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. పనిముట్లు లేకపోవడంతో కొంత మంది పనిని కోల్పోతున్నారు.

తప్పని అదనపు భారం

తాగునీరు, పనిముట్లు, వేసవి అదనపు వేతనం, టెంట్లు, ప్రథమచికిత్స కిట్లు, మేట్లకు ఇచ్చే పారితోషికం వంటి రాయితీలన్నీ ప్రస్తుతం నిలిచిపోవడంతో కూలీలపై అదనపు భారం పడుతోంది. పనిముట్లు కొనుగోలు చేసేందుకు రూ.500 నుంచి రూ.700 వరకూ ఖర్చు అవుతోందని పలువురు కూలీలు తెలిపారు. గతంలో జాబ్ కార్డు కలిగిన వేతనదారులందరికీ పరికరాలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. పనిలోకి రావాలంటే పనిముట్లు తెచ్చుకుంటేనే మస్టర్ వేస్తున్నారు. పెరిగిన ధరలతో సతమతం అవుతుండగా నిర్దేశించిన వేతనం రాక ఆపసోపాలు పడుతున్న తమకు అదనపు ఖర్చులు తప్పడం లేదని గ్రామీణులు ఆవేదన చెందుతున్నారు.



అర్జీ దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

90 శాతం అర్జీల పరిష్కారం

స్పందనలో కలెక్టర్ కృతికాశుక్లా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జిల్లా స్థాయి స్పందనలో ఇప్పటి వరకూ 90 శాతం అర్జీలను పరిష్కరించామని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా తెలిపారు. సోమవారం సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ హాల్లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ కృతికాశుక్లా, జెసి ఎస్.ఇలాక్కియా, డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ ఈడీ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, కాకినాడ ఆర్‌డిఒ ఎన్‌వివి సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం..స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గతేడాది నియోజక వర్గ, డివిజన్, మండల కేంద్రాల స్థాయిలో స్పందన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మండల స్థాయిలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో సామర్లకోటలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వివిధ శాఖల నుంచి రీఓపెన్ అయ్యే దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు నమోదు కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఈ కార్యక్రమం కింద క్షేత్రస్థాయిలో, 1902 ద్వారా, డయల్ యువర్ కలెక్టర్, డయల్ యువర్ కమిషనర్, డయల్ యువర్ ఎస్‌పి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. స్పందన కార్యక్రమం అనంతరం సంబంధిత శాఖల అధికారులు సామర్లకోటలోని తమ శాఖలకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి, ఎంపిడిఒ డి.శ్రీలలిత పాల్గొన్నారు. మొత్తంగా 245 అర్జీలు అందాయి.

సిఎం పర్యటన కోసమే స్పందన : తుమ్మలచ

సామర్లకోటలో సిఎం పర్యటన నేపథ్యంలో ప్రజల నుంచి నిరసనలు రాకుండా తప్పుకునేందుకు సోమవారం జిల్లా స్థాయి స్పందనను నిర్వహించారని జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామిబాబు అన్నారు. ప్రజల సమస్యలపై ఆయన స్పందనలో వినతిపత్రం అందించారు. తాగునీటి ఫిల్టర్ బెడ్ సమస్యల కారణంగా మంచినీరు రావట్లేదన్నారు. సామర్లకోట-పిఠాపురం ప్రధాన రహదారి శిథిలమైందని, ఏలేరు కాలువపై వంతెన అసంపూర్తిగా ఉందని, పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని తదితర సమస్యపై ఆయన వినతిపత్రాలు ఇచ్చారు. ఆయన వెంట జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే పలువురు టిడిపి నాయకులు పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు.

అక్టోబర్ నాటికి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ ఏడాది అక్టోబర్ నాటికి తాళ్లరేవు సిహెచ్‌సి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎపిఎంఎస్ఐడిసి) అధికారులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో డ్రింకింగ్ వాటర్ సంపు నిర్మాణానికి, మార్చురీ నిర్మాణానికి జరుగుతున్న మార్కింగ్ పనులను ఎంఎల్‌ఎ పరిశీలించారు. ఆసుపత్రిలో మార్చురీ నిర్మాణానికి స్థలం సరిపోకపోవడంతో పాటూ, ఆపరేషన్ థియేటర్ చెంతన మార్చురీ నిర్మాణం సరికాదని వైద్యురాలు శిరీష తెలిపారు. దీంతో మార్చురీ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఎంఎల్‌ఎ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎపిఎంఎస్ఐడిసి డిఇ చక్రవర్తి, ఎఇ యోగి కిరణ్ ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణాల ప్రగతిని ఎంఎల్‌ఎకు వివరించారు. యోగికిరణ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రూ.4.44 కోట్లతో పైఅంతస్తులో రెండు బ్లాకుల నిర్మాణం, ఆపరేషన్ థియేటర్, రెండు వార్డులు, బయో మెడికల్ వేస్ట్‌కు సంబంధించి మూడు గదులు, కింది భాగంలో రెనోవేషన్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రూ.35 లక్షలతో ఆసుపత్రిలో పలు పరికరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో కమిటీ డైరెక్టర్లు, ఆసుపత్రిలో ఒక వైద్యురాలు పనితీరుపైన చర్చించారు. ఆసుపత్రికి, రోగులకు ఇబ్బంది కలిగించే పనులు చేయరాదని తెలిపారు. కమిటీ డైరెక్టర్లు అద్దంకి లక్ష్మీనారాయణ, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డిలను ఎంఎల్‌ఎ ఈ మేరకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి సభ్యులు సామ్యూల్ సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, కాదా గోవింద కుమార్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, వినకోటి లోవకుమారి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక నాయకులు రెడ్డి బాబు, చలపతి, శ్రీమన్నారాయణ, వెంకన్న, మోహన్‌పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్



రౌతులపూడిలో పుస్తకాలు అందిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా వరుపుల రాజా జయంతి

ప్రజాశక్తి -రౌతులపూడి

డిసిసిబి మాజీ చైర్మన్ వరుపుల రాజా జయంతిని మండలంలో పలు గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. టిడిపి సోషల్ మీడియా సభ్యులు రాజా జయంతి సందర్భంగా రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. బలరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడ్రాజు తదతరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో మెగా రక్తదానం శిబిరం

ఏలేశ్వరం : వరుపుల రాజా జయంతి పురస్కరించుకుని ప్రత్తిపాడులో టిడిపి శ్రేణులు సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. ఈ శిబిరాన్ని ప్రతిపాడు టిడిపి ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ, యనమల కృష్ణుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ రాజా అను నిత్యం ప్రజాసేవ కోసం పాటుపడే వారిని కొనియాడారు. ఈ శిబిరంలో 200 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నాయి. ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ యనమల కష్ణుడు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పెంద్ర శ్రీను, ఎండగుండి నాగబాబు, కె.వెంకటరమణ, నాయకులు బెల్లాని శ్రీను, బి.ప్రసాద్, వై. సుబ్బారావు, బి.మణి తదితరులున్నారు.

పేదల స్థలాలను కబ్జా చేస్తున్న ద్వారంపూడి

మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేదల స్థలాలను కబ్జా చేసి తన అనుచరులతో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి దోచుకుంటున్నారని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో దుమ్ములపేటలో పేదలకు పట్టాలు మంజూరు చేసిన ప్రాంతంలో పట్టాదారులతో కలిసి ఆయన సోమవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో దుమ్ములపేటలో 2017లో 347 మంది నిరుపేదలకు పట్టాలను మంజూరు చేసి, అప్పటి మంత్రుల ఆధ్వర్యంలో అందించామన్నారు. లబ్ధిదారులు గృహ నిర్మాణం కోసం హౌసింగ్ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ నాడు లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేసి ప్రొసీడింగ్ ఆర్డర్స్ కూడా అందించొందన్నారు. 2019లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోలేకపోయారన్నారు. అనంతరం వైసిపి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ భూములపై కాకినాడ ఎంఎల్‌ఎ ద్వారంపూడి కన్ను పడిందన్నారు. తన అనుచరులతో కబ్జా చేయించి అక్రమ కట్టడాలు నిర్మించబోగా పట్టాదారులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. ప్రభుత్వ అధికారులను నిలువరిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నేడు ద్వారంపూడి తన అధికార బలంతో కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఆక్రమించిన స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారన్నారు. ఎంఎల్‌ఎ ద్వారంపూడి ముఖ్య అనుచరుడు, 10వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పడాల రామారెడ్డి ఈ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నాడని తెలిపారు. పట్టాదారులు గహాలు నిర్మించుకోవడానికి వెళ్తే పోలీసులతో అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారుర. ఎంఎల్‌ఎ ద్వారంపూడి, కాకినాడ పోర్టు సిఐ రామ్మోహన్ రెడ్డి, పడాల రామిరెడ్డి కలిసి ఈ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఎరిపిల్లి రాము, తుమ్మల సునీత, మూగు రాజు, చోడిపిల్లి సతీష్, కోమటి మసేనమ్మ, కసింకోట చంద్రశేఖర్, చోడిపిల్లి ప్రేమ్, అబ్బాయి, చిన్ని, గంపల లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో

విద్య, ఉపాధి కోసం పోరాటాం

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ పిలుపులో భాగంగా కాకినాడలో 2వ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి బాలజీ చెరువు సెంటర్ వరకు 152 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాము, ఎం.గంగాసూరిబాబు మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులు విద్య, ఉపాధి కోసం పోరాడాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పైబడినా దేశంలో విద్య నేటికీ అందని ద్రాక్షగానే ఉందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్ కొఠారి కమిషన్ చెప్పినట్టుగా విద్యారంగానికి కేంద్ర బడ్జెట్లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులను కేటాయించాలన్నారు. విద్యారంగానికి తక్షణం నిధులు పెంచాలన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. దేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడాలనే ఉద్దేశంతో 'సేవ్ ఎడ్యుకేషన్, సేవ్ రాజ్యాంగం, సేవ్ ఇండియా' నినాదంతో ఆజాద్ ర్యాలీని నిర్వహించామన్నారు. విద్యార్థులు భారత స్వాతంత్ర్య ఉద్యమం, చరిత్రను చదవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు పి.వరహాలు, నగర నాయకులు సాహిత్, వాసు, రవితేజ, అభిషేక్, చరణ్ తేజ్, సత్య, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకంతో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పలు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -కరప, రౌతులపూడి

కరప మండలం పరిధిలోని నడకుదురు, గొడ్డటిపాలెం పంచాయతీల్లో వార్డు మెంబర్ల ఉప ఎన్నిక ఏకగ్రీవమైందని ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గొడ్డటిపాలెంలో 6 వార్డుకు నలుగురు సభ్యులు నామినేషన్ వేశారు. ముగ్గురు ఉపసంహరించుకున్నారు. దీంతో చోడ బత్తుల మణికంఠ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే నడకుదురులో ఏడో వార్డుకు ముగ్గురు సభ్యులు నామినేషన్ వేయగా ఇద్దరు ఉపసంహరించుకున్నారు. దీంతో గుళ్లపల్లి మాధవ శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి సంబంధిత అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించారని తెలిపారు.

రౌతులపూడి మండలంలోని ఎ.మల్లవరం, జల్దా, ఎం.కొత్తూరు గ్రామ పంచాయతీల్లో మూడు వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయని ఎంపిడిఒ ఎం.గోవిందు సోమవారం తెలిపారు. ఎ.మల్లవరం పంచాయతీలో రొంగల రాజేశ్వరి, ఎం.కొత్తూరులో యమలపల్లి రామలక్ష్మి, జల్దాంలో కోసూరి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

కాండ్రేగుల 3వ వార్డు బరిలో ఇద్దరు

ప్రజాశక్తి - పెదపూడి

కాండ్రేగులలో 3వ వార్డు మెంబర్ స్థానానికి పోటీ నెలకొందని ఎన్నికల స్టేజ్ 1, 2 అధికారి ఎల్.గణేష్‌బాబు తెలిపారు. ఈ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలు కాగ ఇద్దరు ఉపసంహరించుకున్నారన్నారు. పేపకాయల నవీన్, పేపకాయల సాయిబాబు మధ్య పోటీ నెలకొందన్నారు. ఈ నెల 19 ఎన్నిక నిర్వహిస్తామని, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామని తెఇపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.విజయభాస్కర్, సచివాయలం కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువకులకు 'మన పెద్దాపురం' అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

విశాఖలో ఈనెల 13న జరిగిన సెకండ్ ఎపి స్టేట్ డెడ్ లిఫ్ట్ ఛాంపియన్షిప్ - 2023, 5వ స్టేట్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్-2023 పోటీల్లో బంగారు పతకాలు సాధించిన సామర్లకోట, పెద్దాపురం యువకులను 'మన పెద్దాపురం' ఫేస్‌బుక్ గ్రూప్ సభ్యులు అభినందించారు. ఈ పోటీల్లో డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్ పోటీ 93 కేజీల విభాగంలో పెద్దాపురానికి చెందిన జివి.సత్యనారాయణ, 105 కేజీల జూనియర్ విభాగంలో సామర్లకోటకు చెందిన కె.బాబి, 105 కేజీల సబ్ జూనియర్ విభాగంలో సామర్లకోటకు చెందిన డి.రాజేష్, 108 కేజీల డెడ్ లిఫ్ట్ విభాగంలో పెద్దాపురానికి చెందిన కె.శివకుమార్ బంగారు పతకాలు సాధించారు. వీరిని మన పెద్దాపురం ఫేస్‌బుక్ సభ్యులు పెద్దిరెడ్డి నరేష్, లక్ష్మణ్, దివాకర్, వంగలపూడి శివకృష్ణ, నవీన్, నాని, సత్య, ప్రశాంత్, ప్రవీణ్ తదితరులు అభినందించారు.

'టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి'

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం ఆనూరులో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టిడిపిని అధికారంలోకి తీసుకొస్తే ఏడాదిలో ప్రతి కుటుంబానికి రూ.1.22 లక్షలు లబ్ధి చేకూరే విధంగా టిడిపి అధినేత చంద్రబాబు మేనిఫెస్టోని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజాసూరి బాబురాజు, టిడిపి కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, మాజీ మేయర్ సుంకర పావని, నాయకులు తిరుమలకుమార్, కొత్తిం కోటి, కందుల విశ్వేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, ఆర్.వెంకట్రావు, ఎ.కుమారస్వామి, టి.నాని, సుబ్రహ్మణ్యం, సతీష్, ఎగ్గాడ శ్రీను, ఎన్.కిరణ్, బి.వాసు, సాల్మన్ రాజు, రామలక్ష్మి, సూర్యావతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సహకారంతో జాతీయ జెండాల పంపిణీ

అన్నవరం : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్నవరం రోటరీ క్లబ్ సహకారంతో సోమవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. క్లబ్ నూతన అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల కార్యాలయాలకు, విద్యాసంస్థలకు, మెడికల్ షాపులకు జాతీయ జెండాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కేశవరాజు, ఎ.సూరయ్య దొర, డాక్టర్ శ్రీకాంత్, డి.శంకర్ తదితర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వివక్ష చూపుతున్నారని దళిత సర్పంచ్ వినతి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అండదండలతో స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు తన పట్ల వివక్ష చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కొండేవరం సర్పంచ్ వేమగిరి చెల్లమ్మ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చెల్లమ్మ మాట్లాడారు. దళిత మహిళను కావడం, టిడిపి బలపర్చిన అభ్యర్థి కావడంతో వేధింపులకు దిగుతున్నారన్నారు. లేనిపోని అవినీతి ఆరోపణలు చేసి చెక్ పవర్‌ని రద్దు చేశారన్నారు. సచివాలయ భవనాలు నిర్మాణంలో, పంచాయతీ నుంచి నిధులు ఇవ్వలేదని ఎంపిటిసి భర్త అధికార పార్టీ అండదండలంతో వివిధ రకాల ఒత్తిళ్లకు గురిచేస్తున్నారన్నారు. అవినీతి ఆరోపణ లేకున్నా విచారణ లేకుండా చెక్ పవర్‌ను రద్దు చేయడం ఎంతవరకూ సమంజసమని ఆమె ప్రశ్నించింది. నిజనిర్ధారణ వేసి తనకు న్యాయం చేయాలని కోరింది. ఆమె వెంట టిడిపి మండల అధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి, ఎంపిటిసి సుభ్యులు దుల్ల సత్తిబాబు, వేమగిరి రాంబాబు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు మడికి ప్రసాద్ పాల్గొన్నారు.



నాయకులతో కలిసి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ చెల్లమ్మ

'లిటిల్ స్టార్స్' ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక బొజ్జావారి తోటలోని చిన్న ఆంజనేయులు స్వామి విగ్రహం వద్ద లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సామర్లకోట విజన్ ఐ కేర్ వైద్యులు శ్రావణి, ఉమామహేశ్వరీ వారి వైద్య బందం సుమారు వంద మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. పదిమందిని ఆపరేషణ్లకు రిఫర్ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రతి గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొత్తపల్లి బుజ్జి, మఠం లోవరాజు, నాగేశ్వరరావు, వి.భూషణం, ట్రస్ట్ సభ్యులు టి.రాధ, కృపారాణి, బ్యూలా గ్రేస్, సిహెచ్.శామ్సన్, రోషన్, జనతా ఫౌండేషన్ జమ్ము, బి.నానిబాబు, ఎం.ఏలియా, సూరిబాబు పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

'డయల్ యువర్ కమిషనర్'కు పలు వినతులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు ఫోన్‌లో విజ్ఞాపనలను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, వీధి దీపాలు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఏడుగురు ఫోన్ల ద్వారా సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగానే డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందన్నారు.

నేరాలు ఘోరాలు

ఎరువుల దుకాణంలో విజి'లెన్స్'

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని అర్తమూరులో శ్రీ కల్కి చెన్నకేశవ ఏజెన్సీస్ దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకపోవడం, స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయకపోవడం, గ్రౌండ్ స్టాక్‌నకు, స్టాక్ రిజిస్టర్‌కు తేడాలు ఉండటంతో షాపుపై 6ఎ కేసు నమోదు చేశారు. సుమారు రూ.1,865 విలువ గల 315 కిలోల యూరియాను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

మీనానగరంలో సెబ్ తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

కొవ్వూరు సెబ్ స్టేషన్ పరిధిలో చాగల్లు గ్రామ శివారు మీనానగరంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ ఇటివివి.సత్యనారాయణ దేశాలు మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సారా కేసులో పాతనేరస్తుడు బెజవాడ శ్రీనివాసరావును అదుపులోనికి తీసుకోని తహాశీల్దార్ ఎదుట హాజరుపరిచ్చారు. బైండోవర్ చేశామని సత్యనారాయణ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సెల్ ఫోన్ ఎక్కువగా చూస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామానికి చెందిన గుబ్బల సురేష్(14) ఇంటి నుంచి పరారయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సైకిల్ రిపేర్ చేయించుకుంటానని చెప్పి అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయాడని తండ్రి గుబ్బల నాగేశ్వరరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సురేష్ ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఎరుపు నలుపు చారల టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. బాలుని ఆచూకీ తెలిస్తే సామర్లకోట సిఐ 9440796568, ఎస్ఐ 9701626506 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సిఐ దుర్గాప్రసాద్ కోరారు.

ఎసిబి వలలో లైన్‌మ్యాన్

ప్రజాశక్తి- అన్నవరం

ఎసిబి వలలో లైన్‌మ్యాన్ చిక్కాడు. సోమవారం శంకవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన ఎస్.శ్రీను అనే రైతు తన పొలంలో బోర్ వేసికొనేందుకు లైన్‌మ్యాన్ అల్లు తాతాజీ రూ.5 వేలు లంచం అడిగాడు. దీంతో రైతు శ్రీను ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. శంకవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లంచం తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి శివారు జాతీయ రహదారిపై ఎన్‌టి.రాజాపురం కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గూడాల నవీన్ కుమార్ బైకుపై రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్ ఎగిరి మరొక కారుపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని యువకుడిని రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ తీసుకెళ్లారు.

17న వికాసలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 17న డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో మెడికల్ కోడింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవిఎల్.రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బిఎస్‌సి లైఫ్ సైన్స్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.2లక్షల జీతం, ఇన్సెంటివ్స్ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 17న కలెక్టరేట్ ప్రాంగణంలో వికాస కార్యాలయం వద్ద ఉదయం 9గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్సులతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7799376444 నెంబర్‌ను లేదా www.vikasajobs.com వెబ్ సైట్‌ను సంప్రదించలన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్థానిక బాలయోగి స్టేడియం ముస్తాబైంది. మంగళవారం జరిగే వేడుకలకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని ఆర్ఎఒ తెలిపారు.

సీనరేజి వసూలుకు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం తూరంగి పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేయిస్తున్న లే అవుట్లలో నింపుతున్న గ్రావెల్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించిన సీనరేజీ చెల్లించారా లేదా సంబంధిత భూ యజమానుల రికార్డులు తనిఖీ చేసి నిగ్గు తేల్చాలని ఎంపిటిసి మాజీ సభ్యులు పితాని వెంకటరాము స్పందనలో ఫిర్యాదు చేశారు. తూరంగిలో వందలాది ఎకరాల్లో లేఔట్లు వేస్తూ గ్రావెల్‌తో పూడ్చుతున్నారన్నారు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు. ఫిల్లింగ్, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి రావాల్సిన సొమ్మును పూర్తిగా జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కలెక్టరేట్‌లో డాక్టర్ కృతికాశ్లా కారుణ్య నియామకం కింద ఇద్దరికి నియామక పత్రాలను అందించారు. గ్రామ సచివాలయంలో గ్రేడ్-2 విఆర్ఒ, సంక్షేమం అండ్ విద్యా కార్యదర్శిగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు.

సాగునీటిని విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలోని పొలాలకు పుష్కర కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలంటూ తహశీల్దార కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. గండేపల్లి మండల పరిధిలో ఉన్న తాళ్లూరు, రాజపూడి, నాయకంపల్లి లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి పుష్కర నీటిని వెంటనే విడుదల చేయాలని నినదించారు. తొలుత టిడిపి కార్యాలయం నుంచి జగ్గంపేట సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. నెల రోజుల క్రితమే సాగునీటి ఇబ్బందులపై అధికారులు, ప్రజాప్రతినిధులను కోరామన్నారు. అనంతరం ఉమ్మడి గోదావరి జిల్లాల నేతలతో బస్సు యాత్ర చేసి తాళ్లూరు, రాజపుడి లిఫ్టులను పరిశీలించామన్నారు. అయినా అధికారుల్లో స్పందన లేదన్నారు. అధికారుల తీరుకు నిరసనగా ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా స్పందించి సాగు నీరు అందించాలన్నారు. లేకుంటే కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, వేములకొండ జోగారావు, కొత్త కొండబాబు, బుల్లపు చౌదరి, రేఖ బుల్లిరాజు, బండారు చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టిడిపి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న జ్యోతుల నెహ్రూ

అమరుల త్యాగాల వల్లే స్వాతంత్ర్య ఫలాలు

అమరవీరుల కుటుంబాలకు ఘన సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

అమరవీరుల త్యాగాలవల్లే స్వాతంత్రోద్యమ ఫలాలను అనుభవించ గలుగుతున్నామని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. అజాదిక అమత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక వివేకానందపార్కు ఆవరణలో 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి పద్మశ్రీ, కుడా ఛైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగర అధ్యక్షులు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. తొలుత పార్కు ఆవరణలోని భరతమాత విగ్రహానికి, స్వాతంత్రోద్యమకారుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కార్గిల్‌తోపాటు భారతసరిహద్దులను, నక్సలైట్ల చేతుల్లో హతమైన అమరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. అమరవీరుల పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సత్యప్రసాద్, ఎస్ఇ సత్యకుమారి, కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిసిపి హరిదాసు, ఎసిపి నాగశాస్త్రులు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు చేపడుతున్న ఆర్జెడి నాగమణి

జిఇఆర్ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేను నూరు శాతం పూర్తిచేసేలా విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని ఆర్‌జెడి నాగమణి ఆదేశించారు. సోమవారం సామర్లకోటలోని జగ్గమ్మ గారి పేట మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక, మధ్యాహ్నం భోజన పథకం, హాజరు పట్టీలను పరిశీలించారు. నాగమణి మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలందరు బడిలో ఉండే నిమిత్తం కొన్ని రోజులుగా సర్వే జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్ పరిధిలో ఉన్న యాప్ ద్వారా ఈ సర్వే పూర్తి చేసి ఎన్‌రోల్‌మెంట్ పెంచే విధంగా చూడాలన్నారు. తగిన శ్రద్ధ తీసుకుని జిఇఆర్ సర్వే నూరుశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పి.పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్ పరిశీలన

కాకినాడ : కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివిప్యాడ్‌ల గొడౌన్‌ను కలెక్టర్ కృతికాశుక్లా రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా గోడౌన్లను తనికీ చేసి నివేదిక పంపిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, తహశీల్దార్ సీతాపతిరావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

ప్రజాశక్తి -కరప

గురజానపల్లి స్కూలుకు రూ.45వేల విలువ చేసే సౌండ్ సిస్టంను దాత డాక్టర్ విష్ణుమూర్తి అందించినట్లు హెచ్ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు. సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని డాక్టర్ విష్ణుమూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను అన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివి.రమణమూర్తి, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, శోభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

జగన్ పాలనలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు అన్నారు. తునిలోని టిడిపి కార్యాలయంలో పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అధ్యక్షతన సోమవారం నియోజకవర్గం ఎస్‌సి సెల్ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశలో అప్పారావు మాట్లాడారు. దళిత ఓట్లతో అధికారంలోకొచ్చిన జగన్ ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కువ అన్యాయం చేసింది దళితులకే అన్నారు. బాబు హయాంలో క్రిస్మస్ కానుక, పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారన్నారు. జగన్ అధికారం చేపట్టిన తరువాత వీటిని రద్దు చేశారన్నారు. జగన్ పాలంలో నిత్యావసర వస్తువులు ధరల విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఎస్‌సికార్పొరేషన్ నిధులు దారి మళ్లించి అన్యాయం చేశారన్నారు. ఈ పలివెల రవి, అనంత కుమార్, ఎన్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎ.జార్జి తదతరులు పాల్గొన్నారు.

ఆనూరు దళితపేటలో మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆనూరు దళితపేటలో మౌలిక వసతులు కల్పించాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీలో 20 ఏళ్లుగా దళితులు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. నేటికీ విద్యుత్, మరుగుదొడ్లు, డ్రెయినేజీ వంటి సదుపాయాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు డి.సురేష్, పి.బులిసత్తయ్య, పి.నాగరాజు, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మంత్రి లక్ష్మీనారాయణన్‌కు ఎంఎల్ఎ స్వాగతం

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు యానాం విచ్చేసిన పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్‌కు స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సోమవారం ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. అనంతరం యానాం నియోజకవర్గంలో ఉన్న పలు అంశాలపై చర్చించారు. దానిలో ముఖ్యంగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అందుకు ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సాగునీరు అందక పంట భూములు ఎండిపోతున్నాయని అన్నారు. రోడ్ల నిర్మాణం కోసం నిధులు విడుదలైనా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని మంత్రికి వివరించారు. ప్రతి ఏటా వరద ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, దానికి సంబంధించి రూ.190 కోట్లతో రక్షణ గట్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. అధికారులతో సమీక్షించి సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి లక్ష్మీనారాయణన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.


మంత్రిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప రీజెన్సీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న సుమారు 32 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిసి సంఘాల నాయకులు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. బయన్న, మట్టపర్తి చిన్న, కర్రి రాంబాబుతో పాటు కొంత మంది వ్యక్తులు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి భూమిని కబ్జా చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత నాయకుల అండదండలతో బయన్న అనే వ్యక్తి ప్రభుత్వ భూములు కబ్జా చేశాడని ఆరోపించారు. తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని నాయకులు, బాధితులు ఎంఎల్ఎ అశోక్‌కు వివరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు త్వరలో ఫిర్యాదు చేసి భూ కబ్జాదారులకు శిక్షపడేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు, మల్లాడి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సమక్షంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యుడి అధికారులు, మత్స్యశాఖ అధికారులతో మంత్రి లక్ష్మీనారాయణన్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. మత్స్యకారులకు రావాల్సిన నష్టపరిహారంపై మత్స్య శాఖ అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వం, ఎఇ కాళ్ల నాగరాజు, పిల్లి భాస్కర్, మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో వారం రోజులుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మేరా మిట్టీ - మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ అరుల్‌ప్రకాశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలోని ఎన్‌టిఆర్ స్మారక మందిరం అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సోమవారం అన్నాదానం చేశారు. ముత్యాల సత్తిరాజు జ్ఞాపకార్థం అతని కుమారుడు గండేపల్లి మండలం యర్రంపాలెం తెలుగు రైతు అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు. మోహనరావు మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లను రద్దు చేయడం తదన్నారు. దీంతో స్వచ్ఛందంగా అన్నదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, బి.రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, కంటిపూడి రామారావు, ముత్యాల భాస్కరరావు, మాజీ సర్పంచ్ ముత్యాల వీరభద్రరావు, గుమ్మల్ల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఓటర్ల సర్వేను బాధ్యతగా చేపట్టాలి

ప్రజాశక్తి - పెదపూడి

సమగ్ర ఓటర్ల జాబిత సర్వేను బాధ్యతగా చేపట్టాలని అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసు అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపులు మొదలగు వాటికి సంబంధించిన క్లెయిమ్స్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత కచ్చితంగా పారదర్శకంగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. సర్వేలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సుభాష్, డిటి రామ్‌కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి, విఆర్ఒలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్, పంపన శ్రీనువాసు, చంటి తదితరులు పాల్గొన్నారు

తాటిపర్తిలో ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తాటిపర్తిలో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం నూతన భవనం, విలేజ్ క్లినిక్ భవనాలను సోమవారం కాకినాడ ఎంపీ వంగా గీతా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరు దొరబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ గోపు సూర్యక్రాంతి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ గీత మాట్లాడారు. మహాత్మా గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్యం జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకు ప్రజా సంక్షేమాన్ని తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సభలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజ, ఎంపిడిఒ అశోక్‌కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కంటే వీర రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ, గోపు మురళి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని అమీనాబాద్ పంచాయతీ మాయాపట్నం ప్రజలు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ, తహశీల్దార్లకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు మాట్లాడారు. అమీనాబాద్ పంచాయతీ పరిధిలో మాయాపట్నం ప్రాంతంలోని ప్రజలు తాగునీరు అందక, ఉండడానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటింటికీ కొళాయి, పేదలందరికీ ఇళ్ల స్థలాలు అంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడం తప్ప క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావట్లేదన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా సముద్రం అలలకు తమ ప్రాంతం కోతకు గురై సముద్రంలో కలిసిపోతుందన్నారు. తాగునీటి కోసం సుదూరం ప్రయాణించి బిందె నీళ్లు రూ.20కి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడిలి సతీష్, కుంచె అంజిబాబు, ఏడిది పెద్దబంగారయ్య, వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఒ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

నీలాద్రిరావు పేటలో విఆర్ఒ(గ్రామ పున్ననిర్మాణ సంస్థ) ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. సంస్థ పిఒ శ్రీనివాస్, ఎపిఒ సుధాకర్, వాలంటీర్ రమాదేవి, ఎన్.పార్వతి, సర్పంచ్ ములంపాక సురేష్‌బాబు, గ్రామ పెద్దల సమక్షంలో వీటిని పంపిణీ చేశారు. సర్పంచ్ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యను అందిచాలనే ఉద్దేశంతో విఆర్ఒ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పోలీసు కవాతును ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్ పరిశీలించారు. కవాతులో లోపాలను గుర్తించి, సిబ్బందికి సూచనలు చేశారు. జాతీయ పతాకానికి వందనం చేసే సమయంలో మైదానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వారి వెంట అదనపు ఎస్‌పి(ఎఆర్) బి.సత్యనారాయణ, పెరేడ్ కమాండెంట్(ఎఆర్) డిఎస్‌పి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ లోహిత బ్రాండ్ ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హెచ్ఎం కె.శ్రీదేవి, డ్రాయింగ్ టీచర్ డి.భాస్కర మూర్తి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, రాము తెలిపారు.

స్పందనకు ఐదు అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఐదు అర్జీలు అందాయని ఎఒ పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ తెలిపారు. స్థల ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని, తొలగించిన విద్యుత్ మీటర్ పునరుద్ధరించాలని, భూమి రి సర్వే చేయించాలని అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఎడిఎ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.